## క్లుప్తంగా

### అనర్హులకు డబుల్ బెడ్‌రూంలపై ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్ రాజుకు ఫిర్యాదు చేస్తున్న దరఖాస్తుదారులు

**మంచిర్యాలటౌన్:** మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల 330మంది లబ్ధిదారులకు లక్కీ డ్రాలో అందించిన డబుల్ బెడ్‌రూం పొందిన వారిలో అనర్హులు, ఇప్పటికే ఇళ్లు ఉన్నవారు ఉన్నారని, వాటిని రద్దు చేయాలని కోరుతూ పలువురు గురువారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు ఫిర్యాదు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇళ్లు ఉన్నవారు గతంలో ఇందిరమ్మ ఇళ్లు పొందిన వారు కూడా డ్రాలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పొందారని, వాటిని రద్దు చేయాలని కోరారు.

### చెన్నూర్‌లో విప్ పర్యటన

**చెన్నూర్:** పట్టణంలో శుక్రవారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బాల్క సుమన్ పర్యటించనున్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు 369మంది ఆడపడుచులకు 3,69,92,862విలువ గల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 57మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను అందజేస్తారు. ఉదయం 11గంటలకు ఏఎన్ఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం, సాయంత్రం 4గంటలకు రామకృష్ణాపూర్ లోని రాజీవ్‌చౌక్‌లో 5వ విడత 241మంది మహిళలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తారు. కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు హాజరుకావాలని కోరారు.

### నిరుద్యోగ నిరసనకు తరలిరావాలి

**మంచిర్యాలటౌన్:** జిల్లా కేంద్రంలో టీఎస్‌పీఎస్సీ లీకులు, బీఆర్ఎస్ వైఫల్యంపై ఈ నెల 24, 25 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే నిరుద్యోగ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల తిరుమలరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగుల నిరసనకు ఐక్యత చాటి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



పూజా కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు

**జైపూర్:** మండలంలోని నర్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. హనుమాన్ దీక్షా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ దుర్గాప్రసాద్ స్వామిజీ మంగళశాసనాలతో వేదపండితుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు వైభవంగా సాగే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ఊరు ఊరంతా కదిలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం అన్నదానం చేశారు.

### ప్రమాదాల నివారణకు సిమెంట్ స్తంభాల ఏర్పాటు

**చెన్నూర్:** ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు గురువారం సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయించినట్లు సీఐ వాసుదేవరావు అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో వచ్చి పోయే వాహనాలు ఒకే రూట్‌లో వస్తే యాక్సిడెంట్ అయ్యే అవకాశం ఉండడంతో జేసీబీ సహాయంతో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు ఒకే దారిలో రాకపోకలు సాగించొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ట్రాఫిక్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు పాల్గొన్నారు.

### మామిడి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నెన్నెల:** మండలంలోని ఆవుడం గ్రామంలో గురువారం మామిడి కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారం స్థానికంగానే కొనుగోలు కేంద్రంలో మామిడికాయలను కొనుగోలు చేసి ఒకేసారి డబ్బులు చెల్లించడం చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరమన్నారు. మామిడి రైతులు పట్టణాలకు తీసుకెళ్తే రవాణా చార్జీలు అధికమయ్యేవని, ఇప్పుడు ఈ ప్రాంతంలోనే మామిడి హోల్‌సేల్ దుకాణం ఏర్పడటంతో రైతులకు రవాణా ఖర్చులు తప్పాయన్నారు. ఎలాంటి కమీషన్ తీసుకోకుండా మామిడి తోటల సమీప ప్రాంతంలో ఈ కొనుగోలు కేంద్రం ఉండటం రైతులకు ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ చీర్ల సత్తమ్మ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, చీర్ల మొండన్న పాల్గొన్నారు.



సీసీసీలో నివాళి అర్పిస్తున్న నాయకులు



కాసిపేట: నివాళులర్పిస్తున్న జాగృతి నాయకులు



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీపీఐ నాయకులు

# విప్లవ వీరులకు జోహార్లు

- ఊరూరా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు



పాతమంచిర్యాల: నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

**పాతమంచిర్యాల/బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/నస్పూర్/భీమిని/తాండూర్/మందమర్రిరూరల్/కాసిపేట:** భారతదేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను,ఉద్యమస్ఫూర్తిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం ఆయా పార్టీ కార్యాలయాల్లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. స్వాతంత్య్రం కోసం చిరునవ్వుతో ఉరి కొయ్యలను ముద్దాడి ప్రాణాలర్పించిన ఆ ముగ్గురు యువ కిశోరాల త్యాగాలను ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, బెల్లంపల్లిలోని భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) కార్యాలయంలో ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ, రామకృష్ణాపూర్‌లో సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ, నస్పూర్ సీసీసీ నర్సయ్యభవన్‌లో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లింగం రవి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు, కన్నెపల్లి మండలంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దార్థ్, మందమర్రిలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ పట్టణ కార్యదర్శి దుర్గరాజ్, తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



తాండూర్: సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో..



మందమర్రిలో నివాళులర్పిస్తున్న నాయకులు

## ఆడబిడ్డలకు అండగా కేసీఆర్

- మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు



కంటి వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**మంచిర్యాలటౌన్:** ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తీసుకొచ్చారని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 80మందికి గాను రూ.80,09,280ల విలువ గల చెక్కులను కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు పల్లపు సాయి భార్గవి, మెరుగు మహేశ్వరి, పోరెడ్డి రాజు, నాయకులు పాల్గొన్నారు.

**కంటి వెలుగు శిబిరం సందర్శన**

**మంచిర్యాలటౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే దివాకర్‌రావు సందర్శించారు. కంటి పరీక్షలను చేసుకుంటున్న వారిని వివరాలు అడిగి తెలుసుకుని, శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది, ఇతర సిబ్బందితో మాట్లాడారు. కంటి పరీక్షలకు వచ్చిన వారందరికీ పూర్తిస్థాయిలో కంటి పరీక్షలు చేసి, వారికి ఉన్న సమస్యను నిర్ధారించాలని సూచించారు. అనంతరం కంటి వెలుగు శిబిరం వైద్య సిబ్బంది, ఇతర సిబ్బందిని శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ప్రకాశ్‌నాయక్, అంకం నరేశ్, నాయకులు వంగపల్లి రవీందర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

### మాదిగ హక్కుల దండోరా జిల్లా ఇన్‌చార్జిగా బానయ్య

**బెల్లంపల్లి:** మాదిగ హక్కుల దండోరా మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జిగా బానయ్యను ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు మాదిగ ఒక ప్రకటనలో తెలిపారు.

**పట్టణ కమిటీ ఎన్నిక**

**బెల్లంపల్లి:** మాదిగ హక్కుల దండోరా బెల్లంపల్లి పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనగందుల శివాజీ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కాంపెల్లి శంకర్, ఉపాధ్యక్షులుగా కాంపల్లి సతీష్, బోగే రాజయ్య, మంతెన లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా కళ్లేపల్లి నవీన్, కార్యదర్శిగా సంగీ సారయ్య, సహాయకార్యదర్శిగా ఆరేపల్లి సురేష్, కోశాధికారిగా అంబాల రాజారాంను ఎన్నుకున్నట్లు మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి వెంకటేష్ మాదిగ ప్రకటించారు. వీరితో పాటు మరో 9మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## సమస్యలు పరిష్కరించాలని సమ్మె నోటీసు

**చెన్నూర్/భీమారం:** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో 19ఏళ్లుగా పని చేస్తున్న వీవోఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం చెన్నూర్‌లో ఏపీఎం ప్రమీలకు, భీమారంలో ఏపీఎం త్రియంబక్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. గ్రామాల్లో మహిళ సంఘాలను ఏర్పాటు చేసి సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వీవోఏలు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల పుస్తక నిర్వహణ, ఆన్‌లైన్ వీవో సమావేశాలు, వీవో అకౌంటింగ్ లాంటి విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గౌరవ వేతనం రూ.3900చెల్లించడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, వీవోఏకు కనీసం వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆన్‌లైన్ సేవలను ఏప్రిల్ 2వరకు బంద్ చేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు.



జైపూర్: వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

**మా సమస్యలు పరిష్కరించండి**

**జైపూర్:** 20ఏళ్లుగా సెర్ప్‌లో వీవోఏలుగా పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం కేవలం రూ.3900వేతనం ఇస్తుందని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ గురువారం వీవోఏలు మండల సమైఖ్య సమావేశంలో పాల్గొన్న డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీపీ గోదారి రమాదేవి, జెడ్పీటీసీ మేడి సునితకు వినతిపత్రం అందజేశారు.

### ప్రపంచ స్కూల్ చెస్ పోటీలకు గురుకుల విద్యార్థి



**బెల్లంపల్లి:** ప్రపంచ స్కూల్ చెస్ ఛాంపియన్ షిప్ గేమ్స్ పోటీలకు బెల్లంపల్లిలోని తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపికయ్యాడు. గురుకులంలో పదో తరగతి చదువుతున్న ఐరొండ్ల ఆకాష్‌కుమార్ అనే విద్యార్థి భారతదేశం తరఫున అండర్-17వి భాగంలో జరగనున్న పోటీల్లో పాల్గొనబోతున్నట్లు కాసిపేట బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ తెలిపారు. గ్రీస్ దేశంలో ఏప్రిల్ 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రపంచ స్కూల్ చెస్ ఛాంపియన్ షిప్ గేమ్స్ పోటీలు జరగనున్నాయి. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు చెస్ క్రీడాకారుడు ఆకాష్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## సంక్షిప్త వార్తలు

**పది హాల్‌టికెట్లు డౌన్లోడ్‌కు అవకాశం**

**మంచిర్యాలఅర్బన్:** పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఈ నెల 24నుంచి హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు మంచిర్యాల డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఒరిజినల్ హాల్‌టికెట్ అందుబాటులో లేకున్నా డౌన్లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌పై ప్రధానోపాధ్యాయుని సంతకం లేకున్నా, పరీక్ష రాసేందుకు అనుమతి ఉంటుందన్నారు. www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి విద్యార్థుల హాల్‌టికెట్లు పొందవచ్చన్నారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలుంటే జిల్లా కంట్రోల్ నెంబర్ 08736-252420కు ఫోన్‌చేసి అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు.

**'నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి'**

**రామకృష్ణాపూర్:** టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అంశం సర్వసాధారణమని పేర్కొంటూ బాధ్యత లేని మాటలు మాట్లాడిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, నిరుద్యోగులకు వెంటనే క్షమాపణ చెప్పాలని నేషనల్ స్టూడెంట్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పుర్రెళ్ల నితీష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వల్ల తెలంగాణ వ్యాప్తంగా లక్షలాది మంది యువకులు ఆందోళన చెందుతుంటే మంత్రి లీకేజీ అంశాన్ని చిన్నదిగా కొట్టిపారేయటం నిరుద్యోగులను అవమానించినట్టేనని పేర్కొన్నారు.

**ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ**

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని శివలింగాపూర్ గ్రామ సమీపంలో మూతపడ్డ చెన్నూర్ 2ఇంక్‌లైన్ గని ఆవరణలో ఏర్పాటయ్యే సోలార్ పవర్ ప్లాంటు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి గురువారం శ్రీరాంపూర్ సింగరేణి జీఎం సంజీవరెడ్డి భూమిపూజ చేశారు. రెండు నెలల్లో ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**ఆర్కే 5బి గనిపై 'బాయిబాట'**

**నస్పూర్:** దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థలను స్థాపించిన ఘనత కాంగ్రెస్ ఐఎన్‌టీయూసీదే అని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు తెలిపారు. ఏరియాలోని ఆర్కే 5బి గనిపై నాయకులు బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి శంకర్‌రావు మాట్లాడుతూ కార్మికులకు తమ యూనియన్ ఆధ్వర్యంలోనే సీఎంపీఎఫ్, పెన్షన్ సౌకర్యం, గ్రూప్ గ్రాడ్యుటీ కల్పించామని పేర్కొన్నారు.

**మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించాలి**

**దండేపల్లి:** స్థానిక కస్తూర్బా పాఠశాలను జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి పద్మజ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్నందునా, పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. పరీక్షలంటే ఏ మాత్రం భయపడొద్దన్నారు. ఎలాంటి ఒత్తిళ్లకు లోనవద్దన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు.

**రేపటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు**

**మంచిర్యాలఅర్బన్:** ఓపెన్‌స్కూల్ పదోతరగతి, ఇంటర్ పరీక్షలు ఈ నెల 25 నుంచి జరుగుతాయని మంచిర్యాల డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

**కంటి వెలుగు శిబిరం ప్రారంభం**

**రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు రామాలయం ఏరియాలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కంటి శిబిరంలో ప్రతి ఒక్కరూ పరీక్షలు చేపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మేనేజర్ నాగరాజు, వార్డు కౌన్సిలర్ జాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**పౌష్టికాహారంపై అవగాహన**

**కాసిపేట/మందమర్రిరూరల్/భీమిని/చెన్నూర్‌రూరల్:** పోషణపక్వాడా కార్యక్రమంలో భాగంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో పౌష్టికాహారంపై ప్రతిజ్ఞ చేశారు. కొన్నిచోట్ల పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

**యువత సన్మార్గంలో నడవాలి**

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని లంబడిపల్లిలో గురువారం యువతకు, గ్రామస్తులకు సైబర్ నేరాలపై ఎస్సై శ్వేత అవగాహన కల్పించారు. యువత సన్మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ లక్ష్మిప్రియ, ఉప సర్పంచ్ కళ, వార్డు సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

## స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



రుణాల ప్రొసీడింగులు అందజేస్తున్న డీఆర్‌డీవో

**జైపూర్:** స్త్రీనిధి, బ్యాంకు లింకేజ్ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో శేషాద్రి తెలిపారు. మండల కేంద్రంలో గల ఐకేపీ కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించగా డీఆర్‌డీవో శేషాద్రి, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సునిత ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన వడ్డీ లేని రుణాలను వివరించారు. మండలానికి 20గ్రామ పంచాయతీల్లో 664స్వయం సహాయ సంఘాలకు రూ.1,10,15959 వచ్చినట్లు తెలిపారు. ఈ వడ్డీ లేని రుణాలు 2018-2019, 2019-2020 రెండు సంవత్సరాలవి వచ్చినట్లు వాటి ప్రొసీడింగు కాపీలను మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. అభయహస్తం డబ్బులు త్వరలో అర్హుల సభ్యుల అకౌంట్లో జమవుతాయని తెలిపారు. మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, స్వయం ఉపాధి మార్గంలో వెళ్లాలని, సొంత వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో మండల వ్యాప్తంగా 36కోట్లు మహిళా సంఘాలకు అందించినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, డీఎంజీలు, సీసీలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.

## 'ఉద్యోగులను బెదిరించడం సరికాదు'

**నస్పూర్:** ఎన్‌పీఎస్(న్యూ పెన్షన్ స్కీం) రద్దు చేయాలని ఓల్డ్ పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న ఆందోళనలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ పాల్గొనొద్దు అంటూ ఉద్యోగులను ప్రభుత్వం బెదిరించడం సరికాదని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు గురువారం ఒక ప్రకటలో తెలిపారు. కొద్ది రోజులుగా జాయింట్ ఫోరం ఫర్ ఇన్స్టిట్యూడ్ ఓల్డ్ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో ఈ ఆందోళనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్బంద చర్యలు మానుకోవాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో అరెస్టైన నాయకులు

**మంచిర్యాలటౌన్/కాసిపేట/బెల్లంపల్లి:** ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలతో పాటు, ఇతర పరీక్షా పేపర్ల లీకేజీ వ్యవహారంపై నిరుద్యోగ అభ్యర్థుల పక్షాన పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సిట్ విచారణకు పిలిచి, ముందస్తుగా కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి పోరాటాలను ఆపలేరని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నిరుద్యోగ నిరసన కార్యక్రమానికి గురువారం తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 30లక్షల మంది నిరుద్యోగులు పేపర్ లీకేజీతో రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పదవిలో ఉన్న ఇంద్రకరణ్ రెడ్డి ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ కావడం కామన్ అనడం సిగ్గుచేటని, ఇది పూర్తిగా నిరుద్యోగ విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వమని ఆరోపించారు. విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

## పాఠశాలల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రేఖానాయక్



పొనకల్ సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**జన్నారం:** ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని చింతలపల్లిలో గురువారం 'మనఊరు-మనబడి' కార్యక్రమం కింద పైలట్ ప్రాజెక్టుగా పూర్తయిన చింతలపల్లి ప్రాథమిక పాఠశాలను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, పేద విద్యార్థులకు సహాయమందించాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి, కార్పొరేట్ పాఠశాలల విధంగా తయారు చేస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

**గ్రామ పాలకులకు సన్మానం**

గ్రామ పంచాయతీల్లో 9రకాల పనుల కేటగిరిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచి జాతీయ పంచాయతీ అవార్డులకు ఎంపికైన 15గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, అంగన్‌వాడీ, ఆశ, పారిశుధ్య కార్మికులను గురువారం ఎమ్మెల్యే రేఖానాయక్ ఎంపీడీవో సమావేశ మందిరంలో సన్మానించారు.

## ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు



హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో...



భీమారం: సన్మానిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హాజీపూర్ మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో మండలంలోని 17గ్రామ పంచాయతీలకు గురువారం జాతీయ ఉత్తమ పంచాయతీ పురస్కారాలను అందజేసింది. సర్పంచులకు ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికలు అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వర్ణలత, వైస్ ఎంపీపీ రమాదేవి, ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఎంపీఓ శ్రీనివాస రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య, జెడ్పీ కో ఆప్షన్ నహీంపాషా, ఎంపీపీ కో ఆప్షన్ రఫీక్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

**భీమారం:** గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వృద్ధి సాధించిన 9గ్రామపంచాయితీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ పురస్కారాలను అందజేశారు. సర్పంచులు, కార్యదర్శులకు శాలువా కప్పి పురస్కారాలను అందజేశారు.

**నేడు అవార్డుల ప్రదానోత్సవం**

**వేమనపల్లి:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రశంసాపత్రాలు, సన్మాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మయ్య తెలిపారు.

## సీపీఐ శ్రేణుల కాగడాల ప్రదర్శన



**బెల్లంపల్లి:** దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భారత యువ కిషోరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని పురస్కరించుకుని గురువారం రాత్రి బెల్లంపల్లిలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాగడాల ప్రదర్శన చేశారు. సీపీఐ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన బజారు ఏరియా, పాత బస్టాండ్ మీదుగా భగత్‌సింగ్ విగ్రహం వరకు నిర్వహించారు. అనంతరం కామ్రేడ్స్ భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, సీపీఐ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్, నాయకులు పూర్ణిమ, జీసీ మాణిక్యం, ఎం.ఫౌల్, లక్ష్మీనారాయణ, శ్రీధర్, బాపు, రత్నం ఐలయ్య, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

**మసీదుల ముస్తాబు**

**చెన్నూర్:** రంజాన్ నెల శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. రంజాన్ మాసం కోసం పట్టణంలోని జమా, ఆలంగిరి, లైన్‌గడ్డ, ఇందిరానగర్, చాకలివాడ, పాత బస్టాండ్ ప్రాంతాల్లో గల మసీదులను ముస్లింలు ముస్తాబు చేశారు. స్థానిక సీఐ మసీదులను సందర్శించారు.